క్లుప్తంగా

నేడు నందిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నందిపాడు గ్రామ సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు ప్రజలకు అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. నందిపాడు, కల్వటాల గ్రామాల ప్రజలు హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు కైపలో...

బనగానపల్లె : మండలంలోని కైప గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. ప్రత్యేక వైద్యులతో పాటు టెక్నిషియన్స్ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేస్తారన్నారు. అవసరం మేరకు రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ల కూడా రెఫార్ చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు మంజూరు

కొలిమిగుండ్ల: విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు మంజూరు చేసిందని ఎంఈఓ రాజయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు 2,270 పుస్తకాలు వచ్చాయన్నారు. ఒక్కో పాఠశాలకు 30 లైబ్రరీ పుస్తకాలు చొప్పున, దసరా సెలవులు ముగియగానే పాఠశాలలకు అందిస్తామని ఎంఈఓ చెప్పారు.

చెత్త ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించిన చైర్మన్



యూనిట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని డంపింగ్ యార్డులో చెత్తను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెసింగ్ చేసే యూనిట్‌ను శుక్రవారం డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌తో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ డంపింగ్ యార్డులో ఐదు కోట్లతో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ సిబ్బంది సేకరించిన చెత్తను అలాగే నిల్వ ఉంచడం ద్వారా కాలుష్య పెరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛ భారత్ 2 కింద ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు సేకరించిన 80వేల టన్నులను చెత్తను శాస్త్రీయ పద్ధతిలో ఆరు నెలల్లో ఈ ప్లాంట్‌లో శుద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: మండలంలో పాతపాడు, పసుపల, బనగానపల్లె విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సంజామల: మండల కేంద్రం సంజామల, ఆకుమల్ల, నొస్సం సబ్‌స్టేషన్ పీడర్ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ఆకుమల్ల, వసంతాపురం, కానాల, సంజామల, అక్కంపల్లె, నొస్సం, సంజామల గ్రామాలలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పీహెచ్‌సీని సందర్శించిన నేషనల్ క్వాలిటీ టీం

ప్యాపిలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అస్సురెన్స్ స్టాండర్డ్ టీం సభ్యులు శ్రీధర్ రావు, జైదీప్ కొలె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు పీహెచ్‌సీలో అందుతున్న సేవలను పరిశీలించారు. పీహెచ్‌సీలో నిలువ ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల నిర్వహణ గురించి వైద్యాధికారులు వాణిశ్రీ, నితీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా ఎస్ఐఓ ఆవిర్భావ దినోత్సవం

బనగానపల్లె రూరల్ : స్థానిక స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) కార్యాలయం ఆవరణలో ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ఎస్ఐఓ అధ్యక్షుడు ఆవేజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్ఐఓ జెండా ఎగురవేసి, స్థానిక ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవేజ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు దేశ పురోభివృద్ధికి తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ యాసిన్, జమాతె ఇస్లామి హింద్ అధ్యక్షుడు ఇర్ఫాన్‌ఖాన్, ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్‌ఫైజ్, మహబూబ్‌మియ్యా తదితరులు పాల్గొన్నారు.

కాత్యాయని అలంకారంలో శ్రీ చౌడేశ్వరిదేవి



బనగానపల్లె : కాత్యాయని అలంకారంలో శ్రీ చౌడేశ్వరిదేవి



అంకిరెడ్డిపల్లెలో సరస్వతి అలంకరణలో రాజరాజేశ్వరిదేవి



సంజామల : నొస్సం గ్రామంలో శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి దేవి



ప్యాపిలి: ధనలక్ష్మి అలంకరణలో వాసవీమాత



బేతంచెర్ల: సరస్వతీ మాత అలంకారంలో వాసవీమాత

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు శుక్రవారం కాత్యాయని అలంకారంలో కొలువుదీరారు. ఈఓ రామా నుజన్, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా బనగానపల్లె కొండపేటలో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోవెలకుంట్లలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి, అంకాలమ్మ, మారెమ్మ, ప్రసన్న భారతీమాత ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన శేష ఫణి, శోభ, కాల్వనాగేశ్వరావు, శ్రీవాణి, రాధాకృష్ణ మూర్తి, భాగ్యలక్ష్మి, ఇస్కాల లక్ష్మిప్రసాద్, హేమలత దంపతులు పూజకు ఉభయదారులుగా వ్యవహరించారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు మారెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లె గీతాశ్రమం, తిమ్మనాయునిపేట వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారు సరస్వతీగా భక్తులకు దర్శనమిచ్చారు. సంజామల మండల పరిధి లోని నొస్సంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శ నిమిచ్చారు. మండల కేంద్రం ప్యాపిలిలోని శ్రీమత్కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. మండల కేంద్రం అవుకులో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వ రీ దేవి శుక్రవారం సరస్వతీ దేవి అలంకరణలో కొలువయ్యారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు తాళేపల్లె నాగేంద్రకుమార్ దంపతులు పూజలకు ఉభయదారులుగా వ్యవహరించారు. అదేవిధంగా ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో బిందె సేవా కార్యక్రమం నిర్వహించారు.చల్లా చిన్నపురెడ్డి కాలనీ సమీపంలోని శివాలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని యువకులు తలపై ఎత్తుకొని అమ్మవారిశాలకు చేరుకున్నారు. పెళ్లికాని యువకు లు అమ్మవారిని మోస్తే కోరిన కోర్కెలు తీరుస్తాదని ప్రజల నమ్మకం. మండల కేంద్రం బేతంచెర్ల అమ్మవారిశాల్లో వెలసిన వాసవిమాత సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండా గోపాలు, మోహన్‌రావు, జయచంద్రయ్య, బచ్చు సుబ్రహ్మణ్యం, శేషమోహన్, రాజేంద్ర, విష్ణు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



కోవెలకుంట్ల : అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కర్రా దంపతులు



అవుకు: బిందె సేవా కార్యక్రమంలో అమ్మవారిని మోసుకెళ్తున్న యువకులు

వాసవీమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వాసవీమాతను దర్శించుకున్నారు. ఎమ్మెల్యేతోపాటు ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆర్యవైశ్య సంఘం నాయకులు పెండేకంటి సుబ్రమణ్యం, నాగరాజు, కాల్వ నాగేశ్వరరావు, తదితరులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు.



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వాణి మల్టిస్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రులు



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రులు

డోన్ రూరల్: డోన్ పట్టణంలోని స్థానిక శ్రీనివాస టాకీస్ ఎదురుగా నూతనంగా నిర్మించిన వాణి మల్టిస్పెషాలిటీ ఆసుపత్రిని శుక్రవారం ఆర్థిక, కార్మిక శాఖల మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోన్ పట్టణ ప్రజలకు మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి సేవలు అందుబాటులోకి రావడం హర్షణీయం అన్నారు. ప్రజలకు తక్కువ ఖర్చుతోనే మెరుగైన సేవలు అందించాలని ఆసుపత్రి నిర్వాహకులకు వారు సూచించారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, వైద్యులు రామకృష్ణ నాయుడు, వేణుగోపాల్, నాగరాజు, జయకర్ తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహ హోమం



హోమపూజలు చేస్తున్న పండితులు

మహానంది: గాజులపల్లె గ్రామంలో వెలిసిన నవగ్రహాల, శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గణపతిపూజ, పుణ్యాహవాచనం, నవగ్రహాల హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. స్వామి, అమ్మవార్లకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

రహదారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



సీతారామాపురం రోడ్డును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నయిముల్లా, ఎమ్మెల్యే కాటసాని

- అలియాబాద్‌తండా వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.22.50 కోట్లు
- సీతారామాపురం రోడ్డును ఈఎన్‌సీ నయిముల్లాతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : గ్రామాల్లో నెలకొన్న రహదారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మండలంలోని క్రిష్ణగిరి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అలియాబాద్ తాండ వరకు బీటి రోడ్డు నిర్మాణానికి రూ.22.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయిముల్లాతో కలిసి సీతారామాపురం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఈ రహదారి క్రిష్ణగిరి చెర్లోకొత్తూరు, మంగంపేట, తండా గ్రామాల మీదుగా 18 కిలోమీటర్లు ఉన్నందున, ఈ గ్రామాలతో పాటు కాశీరెడ్డినాయన ఆశ్రమానికి వెళ్లు భక్తులకు ఎంతో ఉపయోకరంగా ఉంటుందన్నారు. ఇంత వరకు ఇక్కడి ప్రజలకు రహదారి సౌకర్యం సరిగాలేక తీవ్ర ఇబ్బందులుపడేవారని, త్వరలో తీరనుందని చెప్పారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఈఎన్‌సీ నయిముల్లా మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఈఎన్‌సీతో కలిసి కాశిరెడ్డినాయన ఆశ్రమంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, డీఈఈ సునీల్‌కుమార్‌రెడ్డి, ఏఈ హుస్సేన్, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ రూరల్: సచివాలయాల ఏర్పాటుతో గ్రామ స్థాయిలోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతున్నాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామ ప్రజలు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. గ్రామ ప్రజలతో ఆయన మాట్లాడుతూ.. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ సచివాలయాల ద్వారా స్థానికంగానే సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. గత ప్రభుత్వాల లాగా ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తామని, ఇంటింటికీ కుళాయి వేసి తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఆర్‌డీఓ వెంకటరెడ్డి, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామచంద్రుడు, ఎమ్మార్వో విద్యాసాగర్, గ్రామ సర్పంచ్ పెద్ద గిడ్డయ్య, కమలాపురం సర్పంచ్ అర్జున్ రెడ్డి, ఉప సర్పంచ్ భవాని, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, వెంకటరాముడు, మారెన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిన వాల్మీకులు

కొలిమిగుండ్ల: అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సీతారామ సమేత వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ శుక్రవారం చేస్తున్న నేపథ్యంలో మండలం నుంచి వాల్మీకులు తరలివెళ్లారు. వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఉలవల నరసింహుడు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల వాల్మీకులు పది వాహనాల్లో తాడిపత్రికి వెళ్లారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



ఇంటిపైకప్పు మరమ్మతుల అనంతరం కుటుంబ సభ్యులతో విక్కీ పౌండేషన్ అధ్యక్షుడు

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి గ్రామంలో ఓ నిరుపేద కుటుంబానికి శుక్రవారం కోవెలకుంట్లకు చెందిన విక్కీ పౌండేషన్ చేయూత నిచ్చింది. గ్రామానికి చెందిన పెద్ద లింగమయ్య, ప్రభావతమ్మ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం గుండెపోటుతో కుమారుడు శివశంకర్, కోడలు విజయకుమారి అనారోగ్యంతో మృతి చెందారు. మనువడు, మనుమరాలి పోషణభారాన్ని మీద వేసుకుని ఆ వృద్ధ దంపతులు శిధిలావస్థకు చేరుకున్న ఇంటిలో కాలం వెల్లదీస్తున్నారు. ఇంటి పైకప్పు దెబ్బతిని వర్షానికి కారుతుండటంతో ఇంట్లో తలదాచుకునేందుకు అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న విక్కీ పౌండేషన్ అధ్యక్షుడు విక్కీ రూ. 12వేలతో ఇంటిపైకప్పు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు పౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పేదల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత



బేతంచెర్ల ఆర్ఎస్ రంగాపురంలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ



వైద్య పరీక్షల వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ

- ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంకు విశేష స్పందన

బేతంచెర్ల: పేదల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ కమటీ సభ్యులు మూర్తుజావలి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో 1,2 సచివాలయం పరిధిలో సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, ఎంపీటీసీలు నాగశేషు, వెంకట సుబ్బమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు, ఈఓఆర్డీ వెంకట రంగ నాయక్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది రోగులకు బీపీ, షుగర్, రక్త, గల్ల పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ, నాయకులు మాట్లాడుతూ ఇంటి వద్దనే రోగులకు వైద్యం అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్ రాధాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు గూని నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, తిమోతి, ఎద్దులన్న, సుబ్బడు, మాబూ, రమణారెడ్డి, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

అవుకు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం అవుకు-3 గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌ను ఆమె పరిశీలించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన క్యాంప్‌లో డాక్టర్లు నవీన్, జయేంద్రరెడ్డి, ఈఎన్‌టీ చిన్నలింగన్న, గైనకాలజిస్ట్ ప్రశాంతి 271 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలను చేశారు. సర్జరీ అవసరమైన 25 మందిని ఆరోగ్య శ్రీకి రెఫర్ చేశారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓ అశ్విన్ కుమార్, సర్పంచ్ మందా గుర్రమ్మ, నాయకులు చల్లా చరణ్ రెడ్డి, చల్లా చైతన్య రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో 365 మందికి వైద్య పరీక్షలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఊటకొండ గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ఇంతియాజ్ ఖాన్ ఆధ్వర్యంలో దాదాపు 365 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరో తొమ్మిది మందిని వివిధ ఆసుపత్రులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ బాలకృష్ణుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రావాలన్న ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు.

వైద్యశిబిరానికి విశేషస్పందన

బనగానపల్లె : మండలంలోని పాతపాడు గ్రామంలో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. వైద్యులు శివశంకరుడు, సోహెల్‌బాబు, ఫిరోజ్, మంగ్యా నాయక్, లక్ష్మి, శైలజలు 900 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన గడ్డం వెంకటేశ్వరరెడ్డి, చిన్నప్పురెడ్డి, తిరుపాల్, రామసుబ్బారెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, సాలమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే వాల్మీకులకు ప్రాధాన్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ హయాంలోనే వాల్మీకులకు తగిన ప్రాధాన్యం లభించిందని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న వాల్మీకి విగ్రహం భూమి పూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో వాల్మీకులకు ఒక మంత్రి పదవి కూడా ఇవ్వలేక పోయిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రివర్గంలో వాల్మీకులకు స్థానం కల్పించిందన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా కూడా వాల్మీకులు ఈ నాలుగున్నరేళ్లలో అభివృద్ధి చెందారన్నారు. వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండన్న, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి గోపాల్, స్థానిక నాయకులు కొండయ్య, తొప్పెల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టెంట్ ఎత్తేసిన తెలుగు తమ్ముళ్లు

డోన్ టౌన్ : స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదుట ఎన్‌టీఆర్ విగ్రహం దీక్షా శిబిరం టెంట్ మూడురోజుల కిందటే ఎత్తేశారు. దీంతో తెలుగు తమ్ముళ్ల నుంచి మద్దతు కరువు అవ్వడంతో టెంట్ ఎత్తేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. డోన్ మండలంలో 46 గ్రామాలు ఉండగా నలభై ఆరు రోజులు కూడా నిరసన దీక్షలు చేపట్టలేకపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

డోన్ టౌన్ : పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్షలు చేపట్టారు. దీక్షలను ఆ సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. దీక్షల్లో నాయకులు సుమన్, సురేష్, మద్దయ్య, లతీఫ్, రమేష్‌నాయుడు, కృష్ణా నాయక్, మధు, చంద్రశేఖర్‌గౌడ్, సర్వజ్ఞమూర్తి, లక్ష్మయ్య కూర్చున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల: విద్యుత్ సమస్యల పరిస్కారంతో పాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ఏడీ మధు సూధన్ రెడ్డి తెలిపారు. డోన్ రహదారిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రస్తుతం ఉన్న 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు, అదనంగా 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైందని ఏడీ తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వలన పట్టణ గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు.